## క్లుప్తంగా

### ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న మంత్రి విశ్వరూప్



సీతారాములను దర్శించుకున్న మంత్రి విశ్వరూప్

**అమలాపురం రూరల్:** బండారులంక గ్రామంలో దంగేటివారిపాలెంలో సీతారామాలయం ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం జరిగింది. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రిని అమలాపురం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దంగేటి డోలమణి, మాజీ సొసైటీ అధ్యక్షుడు దంగేటి బుల్లిబ్బులు సత్కరించారు. ఎంపీటీసీ గుత్తుల జానకిలక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి సరేళ్ల రామకృష్ణ, పార్టీ రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి జాన గణేష్ తదితరులు పాల్గొన్నారు.

### 5న మాజీ ఎమ్మెల్సీ చిట్టబ్బాయి విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణ బ్రోచర్‌ను చూపుతున్న నానిరాజు తదితరులు

**అల్లవరం:** అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లోని గుర్రాల స్టాండ్‌లో ఈ నెల ఐదున మాజీ ఎమ్మెల్సీ దివంగత కుడుపూడి చిట్టబ్బాయి విగ్రహావిష్కరణ జరుగుతుందని అమలాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు తెలిపారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు ఆధ్వర్యంలో స్థానిక మొల్లేటి గరువులోని రామాలయం వద్ద శుక్రవారం విగ్రహావిష్కరణ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొనుకు బాపూజీ, జిల్లా కార్యదర్శి మెరికల శ్రీను, కౌన్సిలర్ చిట్టూరి పెదబాబు, నాయకులు కల్వకొలను ఉమా, బైరిశెట్టి రామారావు, కొల్లు నాగేశ్వరరావు, రాజు, సత్యనారాయణ, శేఖర్, శ్రీను, సాయిబాబు పాల్గొన్నారు.

### నీటి ఎద్దడి లేకుండా చూడాలి

**అల్లవరం:** వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా సచివాలయ ఉద్యోగులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కృష్ణమోహన్ అధ్యక్షతన శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ఉదయం, సాయంత్రం వేళల్లో తప్పనిసరిగా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, పింఛన్ల పంపిణీ నూరు శాతం పూర్తి చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యమివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు రాజమోహన్, శ్రీనివాస్, కేవీవీ సత్యనారాయణ, చిక్కం శ్రీను, శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

### ఇద్దరికీ పింఛను ఇవ్వాలి

**అమలాపురం రూరల్:** భార్యాభర్తలైన వృద్ధ చేనేత కార్మికులకు 60 ఏళ్లు దాటితే ఇద్దరికీ పింఛను అందించాలని వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు కాలెపు నాగశ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన గణేష్ కోరారు. దేవాంగ కార్పొరేషన్ చైర్మెన్ బీరక సురేంద్ర అధ్యక్షతన విజయవాడలో గురువారం జరిగిన రాష్ట్ర దేవాంగుల ఆత్మీయ సమ్మేళనంలో బండారులంక గ్రామం నుంచి చేనేత సంఘ నాయకులు హాజరయ్యారు. చేనేత కార్మికులను ఆదుకునేలా పావలా వడ్డీ పథకం, యార్న్ సబ్సిడీ 30 శాతం రిబేటు, త్రిఫ్ట్ ఫండ్, మార్కెటింగ్ ఇన్సెంటివ్ పథకం అమలు చేయాలని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డికి, సురేంద్రకు వినతిపత్రం ఇచ్చారు. సంఘ ప్రతినిధులు చింతా ఉమామహేశ్వరరావు, చందన శంకర్రావు, కారుపర్తి మల్లేశ్వరరావు, చందన సత్యనారాయణ, మావూరి శివ హాజరయ్యారు.

### నూతన పింఛను అందజేత



కిడ్నీ పింఛను అందజేస్తున్న నాయకులు

**ఐ.పోలవరం:** కొమరగిరి పంచాయతీ మంగాపాలేనికి చెందిన మంగా సుబ్రహ్మణ్యేశ్వరరావు గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. కిడ్నీ మార్పిడి కావడంతో, ప్రభుత్వానికి పది రోజుల క్రితం విన్నవించుకున్నారు. ప్రభుత్వం కిడ్నీ పింఛనుగా మంజూరైన రూ.10 వేలను శుక్రవారం సొసైటీ అధ్యక్షుడు ఏలూరి ఆదినారాయణ, జేఏసీ కన్వీనర్ సఖిలే వెంకటేశ్వరావు, వలంటీరు ఆకుమర్తి కృష్ణ కాకినాడలో సుబ్రహ్మణ్యేశ్వరరావుకు అందజేశారు.

### కొబ్బరి యాజమాన్యంపై శిక్షణ

**యానాం:** ఆత్మ పథకం ద్వారా వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో కొబ్బరి సమగ్ర యాజమాన్యం, చీడపీడల నుంచి రక్షణ తదితర అంశాలపై శుక్రవారం రైతాంగానికి శిక్షణ నిర్వహించారు. అడిపాలెంలోని కొండమూరి భాస్కరరావు కొబ్బరి తోటలో కార్యక్రమం జరిగింది.

# గొంతు తడిసిన వేళ

ఒకప్పుడు దాహంతో అల్లాడే ఆ గ్రామాలకు సముద్రపు నీరే దిక్కయ్యేది. గొంతు తడుపుకోవడానికి ఉప్పు నీటినే ఆశ్రయించే దుస్థితి ఆ తీర గ్రామాలది. అప్పటి పాలకుల అసమర్థతకు పరాకాష్ట అది. ఇప్పుడు పరిస్థితి మారింది. పుష్కలంగా మంచినీరు అందుబాటులోకి రావడంతో పాటు, ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చుకునే స్థాయికి ఆ గ్రామాలు చేరాయి. తమ దాహార్తిని తీర్చిన తీరప్రాంత గ్రామాల ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి జేజేలు పలుకుతున్నారు.

- తీరప్రాంత గ్రామాల్లో దశాబ్దాల కల సాకారం
- వేసవిలో తాగునీటి సమస్యకు చెక్
- రూ.35 కోట్లతో పైపులైన్లు, ట్యాంకుల నిర్మాణం
- పూర్తయినవి 24, మిగిలిన పనులు శరవేగంగా..

**తాళ్లరేవు:** తీర ప్రాంత గ్రామాలు అధికంగా ఉన్న తాళ్లరేవు మండలంలో తాగునీటి సమస్యతో ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత తాళ్లరేవు మండలంలో 30 ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టి, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకువచ్చారు. ముఖ్యంగా వేసవి వచ్చిందంటే చాలు తాగునీటి సమస్యతో ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారు. చుక్క నీరు రాక, గుక్కెడు నీటి కోసం అల్లాడిపోయేవారు. ప్రజా సంక్షేమానికి ఎన్నో చేస్తామంటూ గొప్పలు చెప్పుకున్న గత పాలకులు మాత్రం పూర్తి స్థాయిలో తాగునీరు అందించడంలో విఫలమయ్యారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించింది. ఏళ్ల తరబడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలనే తలంపుతో అనేక చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ నియోజకవర్గంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం అనేక చర్యలు చేపట్టారు. కేంద్ర జల్‌జీవన్ మిషన్ నిధులతో పాటు, మండలంలోని ప్రముఖ చమురు సంస్థ ఓఎన్‌జీసీ సమకూరుస్తున్న సీఎస్ఆర్ నిధులు కేటాయించి, తాగునీటి ట్యాంకులు, పైపుల నిర్మాణాన్ని చేపట్టారు. ఒక్క తాళ్లరేవు మండలంలోనే జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.24 కోట్లు, ఓఎన్‌జీసీ నిధులు రూ.11 కోట్లతో నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ట్యాంకుల నిర్మాణం చేపట్టారు. ఆయా పనులు 80 శాతానికి పైగా పూర్తయ్యాయి. మిగిలిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి.



పోలేకుర్రు పంచాయతీలో ప్రారంభానికి ముస్తాబవుతున్న ఓవర్ హెడ్ ట్యాంకు



జి.వేమవరంలో తాగునీటిని ట్యాంకును ప్రారంభించిన ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ (ఫైల్)

**ఇంటింటికీ కుళాయి కనెక్షన్!**

మండలంలో 17 పంచాయతీలుండగా, 30 ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టారు. ఇప్పటివరకు 24 ట్యాంకులు అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన ఆరు ట్యాంకులు నిర్మాణ దశలో ఉన్నాయి. అంతేకాకుండా జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి పథకానికి కూడా శ్రీకారం చుట్టారు. ఈ మేరకు పటవల, తాళ్లరేవు తదితర పంచాయతీలో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

**ఎమ్మెల్యే కృషితో ప్రజల్లో ఆనందం**

తాగునీటి సమస్య పరిష్కారానికి గతంలో ఏ ఎమ్మెల్యే ఈ స్థాయిలో కృషి చేయలేదని, పనులన్నీ పూర్తయ్యి అందుబాటులోకి వస్తే రాబోయే 30 ఏళ్ల వరకు తాగునీటి కొరత ఉండదని ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి అధిక నిధులు వెచ్చించి, యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టిన ఎమ్మెల్యే పొన్నాడను ప్రజలు అభినవ భగీరథునిగా కీర్తిస్తున్నారు.

### శరవేగంగా నిర్మాణ పనులు



మండలంలో చేపట్టిన తాగునీటి ట్యాంకులు, పైపులైన్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మార్చి నెలాఖరుకు దాదాపుగా పనులు పూర్తవుతాయి. ప్రధానంగా వేసవిలో మండలంలోని కోరంగి, నీలపల్లి, గాడిమొగ, పి.మల్లవరం, పటవల, చొల్లంగి తదితర పంచాయతీల్లో ఓవర్ హెడ్ ట్యాంకులు పూర్తి స్థాయిలో లేకపోవడంతో తాగునీరు అందించలేకపోయేవాళ్లం. అవసరానికి అనుగుణంగా ట్యాంకుల నిర్మాణం, పైపులైన్ పనులు పూర్తవుతుండడంతో, ఇకపై తాగునీటి సమస్య లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నాం. లచ్చిపాలెం, పోలేకుర్రు పంచాయతీల్లో ట్యాంకులు నిర్మాణ దశలో ఉన్నాయి.

– తాడిచర్ల మారుతీరావు, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, తాళ్లరేవు మండలం

### చాలా ఆనందంగా ఉంది



గతంలో తాగునీటి కోసం చాలా ఇబ్బందులు పడేవాళ్లం. ముఖ్యంగా వేసవికాలం వచ్చిందంటే చాలు చుక్క నీటి కోసం రోజుల తరబడి ఎదురు చూడాల్సి వచ్చేది.

కొన్నిసార్లు తాగునీరు అందక ఉప్పునీరే గతి అయ్యేది. ప్రస్తుతం తాగునీటి ట్యాంకుల నిర్మాణంతో సమస్య పూర్తిగా తొలగిపోయింది. త్వరలో ఇంటింటికీ కుళాయి పథకం ద్వారా ఇంటివద్దే తాగునీరు సరఫరా చేస్తామని అధికారులు చెబుతున్నారు. తాగునీటి సమస్య తొలగిపోవడంతో చాలా ఆనందంగా ఉంది.

– పట్నాల శుభలక్ష్మి, మాధవరాయునిపేట, తాళ్లరేవు

## ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీ

మున్సిపల్ కమిషనర్

**అమలాపురం టౌన్:** అమలాపురం మున్సిపాలిటీలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మార్చి 31లోగా పాత బాకీలు సహా మొత్తం పన్ను చెల్లిస్తారో వారికి వడ్డీ మాఫీ వర్తిస్తుందని మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ తెలిపారు. ఇళ్లు, ఖాళీ స్థలాలపై ఉన్న పన్ను మొత్తం వడ్డీ కూడా రద్దు అవుతుందన్నారు. ఈ ఏడాది ఇప్పటికే వడ్డీతో కలిపి పన్ను చెల్లిస్తారో వారికి వచ్చే సంవత్సరంలో చెల్లించాల్సిన పన్నులో ఆ మొత్తాన్ని మినహాయిస్తామని చెప్పారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పట్టణ ప్రజలు ఇళ్లు, ఖాళీ స్థలాలపై ఉన్న అన్ని పన్నులను మొత్తం చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

## శంఖం మల్లేశ్వరరావు కన్నుమూత



మల్లేశ్వరరావు (ఫైల్)

**అమలాపురం టౌన్:** అమలాపురం డ్రగ్ అసోసియేషన్ గౌరవ సలహాదారు, మాజీ అధ్యక్షుడు వెదుళ్లపల్లి మల్లేశ్వరరావు(72) శుక్రవారం ఉదయం అనారోగ్యంతో మరణించారు. ఆయన మృతికి సంఘ అధ్యక్షుడు కొమ్మూరి వెంకటాచల ప్రసాద్, కార్యదర్శి వడ్రే బాబి, జిల్లా కార్యవర్గ సభ్యుడు మోకా వెంకటసుబ్బారావు తదితరులు సంతాపం తెలిపారు. స్థానిక సుబ్బారాయుడి చెరువు వద్ద ఉన్న మల్లేశ్వరరావు స్వగృహానికి వెళ్లిన సంఘ ప్రతినిధులు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

**శంఖం మల్లేశ్వరరావుగా గుర్తింపు**

మల్లేశ్వరరావు శంఖం పూరించడంలో దిట్ట. ఆయన డ్రగ్ అసోసియేషన్ ప్రతినిధిగా కంటే శంఖం మల్లేశ్వరరావుగానే మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఎన్నికలు, ఆలయాల్లో ఉత్సవాల సమయాల్లో ఇలా అనేక చోట్లకు ఆయన తన శంఖంతో వెళ్లి శంఖారావం చేయడం ఆయనకు అభిరుచి.

## సీతారామపురంలో వైఎస్సార్ సీపీ విస్తృత ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న గోవిందకుమార్, ఇతర నాయకులు

**తాళ్లరేవు:** సార్వత్రిక ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు విస్తృత ప్రచారం చేపట్టారు. పార్టీ తాళ్లరేవు మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ నేతృత్వంలోని బృందం కోరంగి పంచాయతీ పరిధిలోని సీతారామపురంలో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వారికి వివరించారు. పథకాలు కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. సర్పంచ్ పెయ్యల మంగేష్, నాయకులు నల్లి శ్రీనివాస్, కట్టా ప్రసాద్, పెయ్యల శ్రీనివాస్, పెంకే రామకృష్ణ, గెద్దాడ బూరియ్య తదితరులు పాల్గొన్నారు.

# వేకువజాము నుంచే పెన్షన్ల పంపిణీ



అమలాపురం 25వ వార్డులో ఓ దివ్యాంగుడికి పెన్షన్ అందిస్తున్న వలంటీర్, వైఎస్సార్ సీపీ నాయకుడు



అమలాపురంలో ఆస్పత్రిలో పెన్షన్ అందజేస్తున్న వలంటీర్

**అమలాపురం టౌన్:** పట్టణంలో శుక్రవారం వేకువజాము నుంచే సామాజిక పెన్షన్ల పంపిణీ మొదలైంది. శుక్రవారం మార్చి ఒకటో తేదీ కావడంతో మున్సిపాలిటీలోని 15 వార్డు సచివాలయాలకు సంబంధించి 281 మంది వలంటీర్లు తమ పరిధిలోని ఇళ్లకు వెళ్లి అవ్వా తాతలు, వితంతువులు, దివ్యాంగుల చేతిలో రూ.3 వేల వంతున పెన్షన్ సొమ్ము పెట్టారు. మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్‌తో పాటు, ఆయా వార్డుల కౌన్సిలర్లు తెల్లవారుతుండగానే పెన్షన్ సొమ్ము పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, కౌన్సిలర్లు కొల్లాటి దుర్గాబాయి, బండారు గోవిందు, చిత్రపు రామకృష్ణ, దొంగ నాగు సుధారాణి తదితరులు వలంటీర్లతో కలిసి పెన్షన్‌దారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లు అందించారు. పట్టణంలో 4,617 పెన్షనర్లకు రూ.1.38 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా, శుక్రవారం దాదాపు 75 శాతం పంపిణీ చేశారు.

**ఆస్పత్రికి వెళ్లి..**

**అమలాపురం రూరల్:** ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారుకు వలంటీర్ శుక్రవారం పెన్షన్ అందజేశారు. పేరూరు–4 సచివాలయం కొంకాపల్లి గ్రామానికి చెందిన చొల్లంగి సత్యవతి అమలాపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతోంది. ఆమెకు రూ.3 వేల పెన్షన్‌ను వలంటీర్ పద్మ ఆస్పత్రికి వెళ్లి అందజేశారు. ఆమెను సర్పంచ్ దాసరి అరుణ, గృహ సారథి రంకిరెడ్డి సత్తిబాబు, కార్యదర్శి రుద్రరాజు సూరపరాజు, సచివాలయ కన్వీనర్ ముత్యాల సత్యమణి అభినందించారు.

# మంత్రి సమక్షంలో కుదిరిన ఒప్పందాలు

**ఉప్పలగుప్తం:** రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సమక్షంలో ఓఎన్‌జీసీ, కెయిర్న్ సంస్థల ప్రతినిధులు ఎస్.యానం గ్రామస్తుల డిమాండ్లకు అంగీకారం తెలిపారు. మంత్రి విశ్వరూప్, కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఓఎన్‌జీసీ అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకుడు జోగి రాజా సమక్షంలో గ్రామస్తులతో కలసి కలెక్టర్ కార్యాలయంలో గురువారం రాత్రి దాదాపు రెండున్నర గంటల పాటు ఆయా సంస్థల ప్రతినిధులు చర్చలు జరిపారు. ఓఎన్‌జీసీ అనుబంధ సంస్థలు వేదాంత, కెయిర్న్ పరిశ్రమలు తమ గ్రామానికి న్యాయం చేయాలంటూ చేపట్టిన ఉద్యమం నేపథ్యంలో గత నెల 13న చర్చలకు పిలిచి, కొన్నింటికి అధికారులు, ప్రతినిధులు సానుకూలంగా స్పందించిన విషయం విదితమే. మరలా గురువారం రాత్రి జరిగిన చర్చల్లో కొన్ని డిమాండ్లకు ఒప్పందం కుదిరింది. వీటిలో గ్రామంలో ఉన్న టెక్నికల్, నాన్ టెక్నికల్‌కు సంబంధించి పరిశ్రమ నుంచి వంద ఉద్యోగాలు కావాలని గ్రామస్తులు కోరగా, ఏడాదికి 25 చొప్పున మూడేళ్లలో 75 ఉద్యోగాలు అందిస్తామని ప్రతినిధులు చెప్పారు. గ్రామంలో కొబ్బరి, ఆక్వాలకు సంబంధించి ఓ కుటీర పరిశ్రమను ఏర్పాటు చేసి, ప్రతి మహిళ రోజువారీ రూ.500 సంపాదించుకునేలా చర్యలు, గ్రామంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాల్లో రెండేళ్ల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరగా, లేబర్ చట్టాన్ని పరిగణనలోకి తీసుకుని పరిశీలిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా తమ గ్రామంలో ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి, అధికారులతో చర్చించి, గ్రామాభివృద్ధిని జరిపిస్తున్న మంత్రి విశ్వరూప్‌కు, సర్పంచ్ జోగి రాజేశ్వరి, ఎంపీటీసీ పెట్టా అప్పారావుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. చర్చల్లో జెడ్పీటీసీ గెడ్డం సంపదరావు, గ్రామ పెద్దలు లంకే భీమరాజు, ఉలిశెట్టి దొరబాబు, జోగి అర్జునరావు, మోకా సత్య తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి విశ్వరూప్‌ను కలిసిన స్టాలిన్‌బాబు



మంత్రి విశ్వరూప్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న స్టాలిన్‌బాబు

**అమలాపురం రూరల్:** వైఎస్సార్ సీపీలో ఇటీవల చేరిన నేలపూడి స్టాలిన్‌బాబు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి విశ్వరూప్‌ను కలుసుకున్నారు. శుక్రవారం భట్నవిల్లిలో మంత్రి స్వగృహం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎంగా గెలిచేందుకు కృషి చేయాలని సూచించారు. మంత్రిని కలిసిన వారిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, నాయకులు సంసాని నాని, పేరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



అమలాపురంలోని ఓ పరీక్షా కేంద్రం వద్ద వేచి ఉన్న విద్యార్థుల తండ్రులు



అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

- ట్రాఫిక్‌తో విద్యార్థుల ఇబ్బందులు
- పలుచోట్ల గైర్హాజరు

**అమలాపురం టౌన్:** ఇంటర్మీడియెట్ పరీక్షలు మొదలైన శుక్రవారమే అమలాపురం పట్టణంలో కొందరు విద్యార్థులు స్థానిక బైపాస్ రోడ్డులో కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించడంతో టెన్షన్ పడ్డారు. ద్విచక్ర వాహనాలు, బస్సులు దిగి పరీక్షా కేంద్రాలకు పరుగులు తీయడం కనిపించింది. నిర్ణీత సమయానికి వారు పరీక్షా కేంద్రాలకు చేరడంతో విద్యార్థులతో పాటు, వారి తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. అమలాపురంలో ఆరు పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు, అధికారుల పర్యవేక్షణ నడుమ పరీక్షలు పకడ్బందీగా జరిగాయి. విద్యార్థుల తల్లిదండ్రులు ఆయా కేంద్రాల వెలుపల వేచి ఉండడం కనిపించింది. తొలి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగింది.

జిల్లాలో 38 పరీక్షా కేంద్రాల్లో తొలి రోజు ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 14,490 మంది పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేశామని జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషనల్ అధికారి (డీఐఈఓ) వనుము సోమశేఖరరావు తెలిపారు. ఇందులో 770 మంది పరీక్షలకు గైర్హాజరు కాగా, 13,720 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని పేర్కొన్నారు. తొలి రోజు ఎక్కడా మాస్ కాపీయింగ్ వంటి సంఘటనలు జరగలేదని, అంతా ప్రశాంతంగా జరిగాయన్నారు.

**ప్రశాంతంగా పరీక్షలు**

**తాళ్లరేవు:** ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని రెండు కేంద్రాల్లో 571 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. తాళ్లరేవు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 235కి 225 మంది హాజరని సెంటర్ ఇన్‌చార్జి కేఆర్‌వీ సత్యనారాయణ తెలిపారు. సుంకరపాలెంలోని శ్రీరవి కళాశాలలో 344కు 336 మంది హాజరని కస్టోడియన్ వి.భారతి తెలిపారు.

**ముమ్మిడివరం:** ఇంటర్మీడియెట్ పరీక్షలు స్థానిక మోకా గణపతిరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగాయి. మొత్తం 320కి 294 మంది హాజరయ్యారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 262కి 188 మంది పరీక్షలకు హాజరైనట్టు కస్టోడియన్ డి.విజయ్‌కుమార్ తెలిపారు.

## టూరిస్ట్ గార్డులకు వేతనాల పెంపు

**యానాం:** పుదుచ్చేరి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలోని వివిధ పర్యాటక కేంద్రాల వద్ద టూరిస్ట్ గార్డులుగా సేవలందిస్తున్న వారి వేతనాలను పెంచుతూ శుక్రవారం ఎండీ కె.మురళీధరన్ ఉత్తర్వులు జారీ చేశారని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. నెలకు ప్రస్తుతం ఇస్తున్న రూ.10 వేలను రూ.18 వేలకు పెంపు చేశారన్నారు. ఈ నెల ఒకటి నుంచే అమల్లోకి వస్తాయన్నారు. నాలుగు రీజియన్లలో మొత్తం 63 మందికి వేతనాలు పెరిగాయని అన్నారు.

## గృహ సారథుల పాత్రపై అవగాహన

**అమలాపురం టౌన్:** వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గృహ సారథులకు పాటించాల్సిన విధులపై స్థానిక వంటిద్దు వారి వీధిలోని రెండో వార్డు సచివాలయంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గృహ సారథులు ఈసారి ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయ్యేలా శ్రమించాలని నియోజకవర్గ పార్టీ నాయకుడు వంటిద్దు వెంకన్నాయుడు విజ్ఞప్తి చేశారు. సచివాలయ కన్వీనర్లు కొండాబత్తుల శ్రీను, యల్లమిల్లి రాజమోహన్, మామిడిపల్లి రాంబాబు, కల్వకొలను బాబి, అన్యం సత్తిబాబు, మంచాల శ్రీనివాస్, గనిశెట్టి శ్రీనివాస్, లక్ష్మణరావు ప్రసంగించారు.

### ఇకనుంచి రాత్రి పారిశుధ్య పనులు

వ్యాపార దుకాణాల వద్ద ట్రయల్ రన్

**అమలాపురం టౌన్:** ఇన్నాళ్లూ వేకువజామునే నివాస గృహాలు, వాణిజ్య దుకాణాల ఏరియాలతో పాటు, ప్రధాన, అంతర్గత వీధుల్లో మున్సిపాలిటీ పారిశుధ్య పనులు చేపడుతోంది. ఇక నుంచి కేవలం వ్యాపార దుకాణాలున్న ప్రాంతాల్లో (కమర్షియల్ ఏరియా) రాత్రి సమయాల్లో పారిశుధ్య పనులు చేపట్టేందుకు మున్సిపాలిటీ సన్నాహాలు చేస్తోంది. మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ ఆదేశాలతో దుకాణాల సముదాయాలు ఉన్న ప్రధాన, అంతర్గత రోడ్ల వద్ద రోజూ రాత్రి సమయంలో పారిశుధ్య పనులు చేపట్టేందుకు ట్రయల్ రన్ చేపడుతున్నారు. శుక్రవారం రాత్రి నుంచి ఆయా దుకాణాలున్న రోడ్లలో ఈ ట్రయల్ రన్ చేపట్టి, ప్రయోగాత్మక చర్యలతో ఫలితాలపై అధ్యయనం చేయనున్నారు. రెసిడెన్షియల్ ఏరియాలు, ప్రధాన రోడ్లు, అంతర్గత రోడ్లు, వీధుల్లో యథావిధిగా పారిశుధ్య పనులు రోజూ మాదిరిగానే ఉదయాన్నే జరుగుతాయి. ఒక్క వ్యాపార దుకాణాలున్న రోడ్లలో మాత్రమే రోజూ రాత్రి సమయంలో పనులు చేపట్టేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. రోజూ సాయంత్రం 6 గంటల నుంచి అర్ధరాత్రి వరకూ ఈ పనులు సాగేలా సన్నాహాలు చేస్తున్నారు. వ్యాపారులు ఈ ప్రయత్నానికి సహకరించాలని మున్సిపాలిటీ విజ్ఞప్తి చేస్తోంది.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**అమలాపురం రూరల్:** కామనగరువు పంచాయతీలో సర్పంచ్ నక్కా అరుణకుమారి ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులకు ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి శుక్రవారం శంకుస్థాపన చేశారు. జీజీఎంపీ నిధులతో విక్టోరియాపేటలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు, ముక్తిదాము వద్ద రూ.10 లక్షలతో సీసీ డ్రైన్, రవణం పుంత వద్ద రూ.5 లక్షలతో సీసీ రోడ్డు, మరో రూ.5 లక్షలతో పైపులైన్, పసిడి చెరువు వద్ద నిర్మించే సీసీ డ్రైన్‌కు సర్పంచ్ నక్కా అరుణకుమారితో కలిసి శంకుస్థాపన చేశారు. జెడ్పీటీసీ పందిరి హరిరామ్‌గోపాల్, ఎంపీటీసీ మెండు గంగాభవాని, ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, వార్డు సభ్యులు చొల్లంగి దేవి, జొన్నాడ పల్లాలమ్మ, గుత్తుల నాగేంద్ర, దేవరపల్లి భవానీ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

**అల్లవరం:** ఓడలరేవు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ఓఎన్‌జీసీ కాకినాడ అసెట్ ఆధ్వర్యంలో సమకూర్చిన 183 సైకిళ్లను ఓఎన్‌జీసీ ఈడీ పి.సురేష్‌బాబు శుక్రవారం పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం కేవీఎస్ఆర్ మూర్తి ఆధ్వర్యంలో సర్పంచ్ మల్లాడి మంగాయమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రూ.12 లక్షల విలువైన సైకిళ్లను విద్యార్థులకు అందించారు. ఓఎన్‌జీసీ జీజీఎం సేన్ గుప్తా, ఐఎంఎం ఆల్వా, చీఫ్ మేనేజర్ శంకర్, సెక్యూరిటీ మేనేజర్ నవీన్, ఎంపీటీసీ పాల శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

## ఆరోగ్య సురక్షతో పేదలకు భరోసా

**ఐ.పోలవరం:** జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా పేదలకు ప్రభుత్వం ఆరోగ్య భరోసా కల్పిస్తోందని కేశనకుర్రు పీహెచ్‌సీ వైద్యురాలు డి.గాయిత్రి అన్నారు. శుక్రవారం తిళ్లకుప్ప సచివాలయ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 335 మందిని పరీక్షించి, మందులు అందించారు. 158 మందికి వివిధ రకాల ల్యాబ్ టెస్టులు నిర్వహించారు. పలువురిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు సిఫార్సు చేశారు.

## సంక్షిప్తం..

### బాధిత కుటుంబానికి సాయం

**తాళ్లరేవు:** అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన మట్టపర్తి తాతారావు కుటుంబానికి రెడ్‌క్రాస్ సొసైటీ వంట సామగ్రి, ఇతర వస్తువులను అందజేసింది. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, రెడ్‌క్రాస్ చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ సూచనల మేరకు సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి వీటిని అందించారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ ఆకుల వెంకటేశ్వర్లు, నాయకులు రెడ్డి రెడ్డిబాబు, బొంతు వీరమోహన్, విత్తనాల రామకృష్ణ, ఈశ్వరరావు, శ్రీను పాల్గొన్నారు.

**నూతన కార్యవర్గం**

**యానాం:** ది యానాం రెసిడెన్షియల్ టాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎండీ సులేమాన్, ఉపాధ్యక్షుడిగా పంపన మధు, కోశాధికారిగా కొండే కృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కుంచే సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా కొండి సురేష్, సలహాదారుగా గుత్తాల రాజేష్ ఎన్నికయ్యారు.

**ట్రేడర్స్ వెల్ఫేర్ బోర్డు సభ్యుడిగా మాజేటి**



**యానాం:** పుదుచ్చేరి ప్రభుత్వం చిన్న వ్యాపారుల సంక్షేమం కోసం ఏర్పాటుచేసిన పుదుచ్చేరి ట్రేడర్స్ వెల్ఫేర్ బోర్డు కార్యవర్గంలో శుక్రవారం యానాం వర్తక సంఘ గౌరవాధ్యక్షుడు మాజేటి సత్యభాస్కర్‌కు చోటుకల్పించారు. ఆయన మాట్లాడుతూ వర్తకుల సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు.

**పల్స్‌పోలియోకు ఏర్పాట్లు పూర్తి**

**అల్లవరం:** గోడిలంక, బెండమూర్లంక పీహెచ్‌సీల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఈ నెల మూడున నిర్వహించే పల్స్‌పోలియోకు అన్ని ఏర్పాట్లు చేశామని వైద్యాధికారులు స్పందన, బాలసుబ్రహ్మణ్యం ఓ ప్రకటనలో తెలిపారు. పల్స్‌పోలియో చుక్కలు పంపిణీ చేయడానికి 33 కేంద్రాల్లో 200 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తారని తెలిపారు.

**డిప్యూటీ తహసీల్దార్‌గా శ్రీనివాసులు**



**ముమ్మిడివరం:** ముమ్మిడివరం డిప్యూటీ తహసీల్దార్‌గా జి.శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన యడ్ల రాంబాబు ఎన్నికల బదిలీల్లో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాసులను వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది అభినందనలు తెలిపారు.

**నిర్మలాశ్రమంలో ఆరాధన మహోత్సవాలు**

**తాళ్లరేవు:** కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటాయపాలెంలోని శ్రీధర నిర్మలాశ్రమం వార్షిక ఆరాధన మహోత్సవాల్లో శుక్రవారం విశేష పూజలు చేశారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పూజలు నిర్వహించారు. వైస్ ఎంపీపీ కొపనాతి లలిత, సర్పంచ్ పెయ్యల మంగేష్, పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, నాయకులు కొపనాతి నాగరాజు, లక్ష్మీనరసింహరాజు పాల్గొన్నారు.

**సీ ఫుడ్స్ యాజమానికి జరిమానా**

**అమలాపురం టౌన్:** ఆక్వా వ్యర్థాలను ప్రధాన పంట కాల్వలోకి వదులుతున్న నిర్లక్ష్యంపై పట్టణ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, వార్డు సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు చర్యలు తీసుకున్నారు. పట్టణంలోని తొమ్మిదో వార్డులోని ఎర్ర వంతెన దిగువున ఉన్న పీజీఎం సీ ఫుడ్స్ షాపు యాజయాని నరసింహస్వామికి రూ.5 వేల జరిమానా విధించారు. కాల్వలోకి అమర్చిన గొట్టాలను ధ్వంసం చేశారు.

**స్ట్రాంగ్‌మెన్ టైటిల్ సాధించిన లవకుమార్**

**ముమ్మిడివరం:** కాకినాడ పీఆర్ కాలేజీలో ఇటీవల జరిగిన ఆదికవి నన్నయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ముమ్మిడివరం హెల్దీలైఫ్ జిమ్ విద్యార్థి వాసంశెట్టి లవకుమార్ స్ట్రాంగ్‌మెన్ ఆఫ్ 2024 టైటిల్ సాధించాడు. ఆలిండియా యూనివర్సిటీ పోటీలకు అర్హత సాధించినట్టు కోచ్ వి.నరేష్ తెలిపారు.